## అబ్దుల్లాపూర్‌మెట్ రైతు వేదికలో రైతు విత్తన మేళా

❖ తక్కువ కాలపరిమితి వడ్ల రకాలు, నానో ఎరువులపై అవగాహన






**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** అబ్దుల్లాపూర్‌మెట్ రైతు వేదికలో నిర్వహించిన రైతు విత్తన మేళా కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం నుంచి సహాయ వ్యవసాయ సంచాలకులు (టెక్నికల్) శ్రీమతి పద్మజ ప్రారంభించారు. వాతావరణ మార్పులు, ఎల్‌నీనో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న తక్కువ కాలపరిమితి సన్న వడ్ల రకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ సోనా (ఆర్‌ఎన్‌ఆర్ 15048), కేఎన్‌ఎం1638, హెచ్‌ఎంటీ సోనా, జై శ్రీరామ్ వంటి వడ్ల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో పాలెం పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన పచ్చజొన్న పీఎస్‌పీవై2 రకం, కందులు, వివిధ రకాల కూరగాయల విత్తనాలు కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికతను రైతులకు పరిచయం చేసే క్రమంలో నానో టెక్నాలజీతో రూపొందించిన నానో యూరియా, నానో డీఏపీ ఎరువులకు ప్రత్యేక ప్రదర్శన స్టాల్ ఏర్పాటు చేశారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి దిగుబడులు పెంచుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, ఎఫ్‌ఎస్‌సీఎస్ బాటసింగారం చైర్మన్ జైపాల్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పల్లవి, హయత్‌నగర్ మండల వ్యవసాయ అధికారి సోల్మన్ నాయక్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జక్కా రవీందర్ రెడ్డి, అబ్దుల్లాపూర్ సర్పంచ్ ఎం. విజయ, చిన్న రావురాల సర్పంచ్ బాలకిషన్ గౌడ్, వ్యవసాయ విస్తరణ అధికారి రఘు, ఎఫ్‌ఎస్‌సీఎస్ సీఈఓ జక్కుల ఐలేష్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణాల ఆరోపణలు

రూ.4 కోట్ల విలువైన స్థలాన్ని పరిరక్షించాలని స్థానికుల డిమాండ్



**దశ, పెద్ద అంబర్ పేట :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్‌బీనగర్ జోన్, నాగోల్ సర్కిల్, పెద్దఅంబర్‌పేట్ 52వ డివిజన్‌లో ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పసుమాముల జెడ్పీ రోడ్డు సమీపంలోని సర్వే నంబర్ 451లో ఉన్న 12 గుంటల ప్రభుత్వ భూమిలో 6 గుంటలు క్రాంతి యువజన సంఘానికి కేటాయించగా, మిగిలిన 6 గుంటల స్థలాన్ని కొందరు అక్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు, ఈ భూమి మార్కెట్ విలువ సుమారు రూ.4 కోట్ల వరకు ఉంటుందని తెలుస్తోంది. గత 35 ఏళ్లుగా క్రాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య సమరయోధుల జయంతులు, వర్ధంతులు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా అవసరాలకు సంబంధించిన పలు కార్యక్రమాలు ఈ స్థలంలో నిర్వహిస్తూ వస్తున్నట్లు పేర్కొంటున్నారు. గతంలో తీసుకొచ్చిన జీవో59 కింద సంబంధిత వ్యక్తి దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం ఉన్నప్పటికీ, ప్రభుత్వ భూమిపై నిర్మాణాలు కొనసాగుతున్నాయంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టి, ప్రభుత్వ భూమిని పరిరక్షించడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని, రెవెన్యూ శాఖ అధికారులను కోరుతున్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: కమిషనర్ శరత్ చంద్ర




**దశ, నల్లగొండ :** వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, కలరా వంటి సీజనల్ వ్యాధులను నివారించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల అమలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మరమ్మతులు, రూ.32 కోట్ల ఆస్తి పన్ను బకాయిల వసూళ్లు, రోడ్లు, డ్రైన్లు, తాగునీటి పైప్‌లైన్లు, TUFIDC నిధులతో చేపడుతున్న పనులు, ఫిల్టర్ బెడ్ నిర్మాణం, అక్రమ నిర్మాణాల నియంత్రణ, ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలు ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడంతో పాటు తడి, పొడి, శానిటరీ, హానికర వ్యర్థాలను వేర్వేరుగా మున్సిపల్ వాహనాలకు అందించాలని కమిషనర్ సూచించారు. ముందస్తు జాగ్రత్తలతోనే వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పి. వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. మనోహర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణవేణి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. అశోక్, అసిస్టెంట్ ఇంజనీర్లు దిలీప్, ప్రవీణ్, అసీం బాబా, శానిటరీ సూపర్వైజర్ జి. శ్రీనివాస్, మేనేజర్ కళ్యాణి, రెవెన్యూ అధికారి శివరాం రెడ్డి, వార్డ్ ఆఫీసర్లు, సెక్షన్ క్లర్కులు తదితర అధికారులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు భవిష్యత్ లేదు: కాంగ్రెస్ నేతలు.

❖ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలకు కౌంటర్
❖ అభివృద్ధి పనులపై రాజకీయాలు చేస్తున్నారని ఆరోపణ



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్ లేదని, ప్రజలు అభివృద్ధి వైపు నిలుస్తున్నారని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. లష్కర్‌గూడ బ్రిడ్జి నిర్మాణ పనులపై బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ అబ్దుల్లాపూర్‌మెట్‌లోని వైఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ బిబ్లాక్ అధ్యక్షుడు, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. జక్క రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ, గత 15 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా సమస్యలను విస్మరించారని ఆరోపించారు. 2021 వరదల సమయంలో జరిగిన ప్రాణనష్టంపై స్పందించని మాజీ ఎమ్మెల్యే, ఎన్నికల ముందు లష్కర్‌గూడ బ్రిడ్జికి శిలాఫలకం వేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. అనాజ్‌పూర్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వరకు రూ.29 కోట్లతో డబుల్ రోడ్డు మంజూరైందని, త్వరలో శంకుస్థాపన జరగనున్న నేపథ్యంలో రాజకీయ మనుగడ కోసం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై బీఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

**అభివృద్ధిని చూసి తట్టుకోలేక విమర్శలు : చిలుక మధుసూదన్‌రెడ్డి**

గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతున్నాయని, గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. కొహెడ మార్కెట్, భారత్ ఫ్యూచర్ సిటీ, ఆరుట్ల మోడల్ స్కూల్, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు.

సీహెచ్ భాస్కరాచారి మాట్లాడుతూ, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపనలు చేసి వదిలేసిన పనులను ప్రస్తుతం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో నిధులు సమీకరించి పూర్తి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, లష్కర్‌గూడ సర్పంచ్ అల్లి అయిలయ్య యాదవ్, జాఫర్‌గూడ సర్పంచ్ యర్ర వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త ప్రభాకర్ గౌడ్, మందుగుల శ్రీశైలం గౌడ్, కావడి శ్రీనివాస్‌రెడ్డి, మారుతి ప్రసాద్, ఏళ్ల బాల్‌రెడ్డి, వివిధ గ్రామాల వార్డు సభ్యులు, ఉపసర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## తెలంగాణ లో ఎస్ఐఆర్ (SIR) భారతీయ జనతా పార్టీ పర్యటన

❖ విజయవంతం చేయాలి అని పిలుపునిచ్చిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్ రావు

**దశ ఓయూ :** పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు రాబోయే GHMC ఎన్నికలు మరియు 2028 లో అధికారమే లక్ష్యంగా దిశానిర్దేశం చేయడం, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో చర్చ జరగనుంది. అలాగే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు మరియు దేశ అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలపై కూడా చర్చించడం జరుగుతుంది. ఈ సమావేశం పార్టీ శ్రేణులకు నూతన ఉత్సాహాన్నిఅందించడంతోపాటు, భవిష్యత్ కార్యాచరణకు మార్గదర్శకంగా నిలవనుందని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్ రావు ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో తెలియజేశారు.

## అశ్వారావుపేటలో బీఆర్ఎస్ సభ్యత్వ, ఓటర్ నమోదు సదస్సు



**దశ,అశ్వారావుపేట :** అశ్వారావుపేట పట్టణంలోని శ్రీశ్రీ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు ఎస్ఐఆర్ (Special Intensive Revision) ఓటర్ నమోదు ప్రక్రియపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు నియోజకవర్గానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలను పార్టీ రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి పార్టీ తరఫున కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగ కాంతారావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్సీ మరియు ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఇంచార్జ్ తెక్కెళ్లపల్లి రవీందర్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఏరోళ్ల శ్రీనివాస్, మాజీ గ్రంథాలయ చైర్మన్ దిండిగల్ రాజేంద్ర, రాష్ట్ర నాయకులు రాకేష్‌రెడ్డి, భద్రాచలం నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ మానే రామకృష్ణ, నాయకులు రాంప్రసాద్, బొమ్మెర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఐదు మండలాల బీఎల్ఏలు, పార్టీ సభ్యత్వ నమోదు బాధ్యతలు స్వీకరించిన నాయకులు, మండల స్థాయి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నూతన వేతనాలు వెంటనే అమలుపరచాలి

... యారం పిచ్చిరెడ్డి



**దశ బూర్గంపాడు :** నూతన వేతన జీవో వెంటనే అమలు పరచాలని కోరుతూ ఐటీసీ యాజమాన్యానికి రాష్ట్ర కనీస వేతన మండలి సభ్యుడు ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఐటీసీ యాజమాన్యానికి వినతి పత్రం మంగళవారం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా యారం పిచ్చి రెడ్డి గారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన నూతన వేతనాల ప్రకారం కార్మికులకు అందవలసిన వేతనాలను ఐటీసీ కర్మాగారంలో కూడా తక్షణమే అమలు చేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్మికులు దైనందిన జీవన వ్యయాల భారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కాబట్టి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ , తెలంగాణ రాష్ట్ర మినిమమ్ వేజ్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ మార్గదర్శకత్వంలో కృషితో తెలంగాణ ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 6 (తేదీ: 30052026)ను విడుదల చేసింది. ఈ కమిటీలో భాగస్వామి అయినందుకు తనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు ఈ ఉత్తర్వుల ప్రకారం, కోడ్ ఆన్ వేజెస్ 2019, షెడ్యూల్I, ఎంప్లాయ్‌మెంట్ లో పేర్కొన్న నూతన కనీస వేతన రేట్లు 01062026 నుండి అమలులోకి వచ్చాయి. కావున, పాత వేతన నోటిఫికేషన్లు రద్దయినందున, ప్రభుత్వం కల్పించిన ఈ కొత్త వేతన సౌకర్యాన్ని ఐ టి సి లిమిటెడ్ పిఎస్పీడీ, భద్రాచలం యూనిట్‌లోని బదిలీ, కాంట్రాక్ట్ కార్మికులకు తక్షణమే వర్తింపజేయవలసిందిగా కోరుతున్నాము అన్నారు.

## అంగన్వాడి నిర్వాహకులకు వేతనం పెంచాలి

❖ మహాసభ విజయవంతం..




**దశ బూర్గంపాడు:** అంగన్వాడి టీచర్లు, ఆయాలకు వేతనాలు పెంచాలని నారాటి ప్రసాద్ అన్నారు. బూర్గంపాడు మండలం తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రాజెక్టు మహాసభ సారపాక ఏఐటీయూసీ ఆఫీస్ కపర్తి భవనంలో మంగళవారం నిర్వహించారు.ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ ఏ ఐ టి యు సిరాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నారాటి ప్రసాద్ హాజరై ప్రసంగించారు. అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ వారు సంఘటితం అవ్వండి మీ హక్కుల కొరకు పోరాడండి సాధించండి అని పిలుపునిచ్చారు ముఖ్యంగా. కనీస వేతనం 18000 ఇవ్వాలని అంగన్వాడీ టీచర్లను బిఎల్ఓ డ్యూటీ నుంచి మినహాయించి చాలి సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలి. ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పోరాటానికి పిలుపునిచ్చారు. గతంలో ఏ ఐ టి యు సి పోరాటాల ఫలితంగానే కొన్ని సాధించామని ఇంకా సాధించవలసినది చాలా సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారం కొరకు అందరూ ఐక్యమై పోరాటానికి సిద్ధం కావాలని అన్నారు.

## ఏటీఎం కార్డులు మార్చి ఖాతాలు ఖాళీ చేస్తున్న కేటుగాడు అరెస్ట్



**దశ, హయత్‌నగర్ :** ఏటీఎం కేంద్రాలకు వచ్చే అమాయక ప్రజలను మోసగించి వారి ఏటీఎం కార్డులను మార్చి, అనంతరం బ్యాంకు ఖాతాల నుంచి నగదు డ్రా చేస్తున్న నిందితుడిని హయత్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి 34 ఏటీఎం కార్డులతో పాటు నేరాలకు ఉపయోగించిన హోండా యాక్టివా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జగ్గంపేటకు చెందిన సిడగం కుమార్ (33) ప్రస్తుతం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో ఫిలింనగర్‌లోని ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న సమయంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి సుమారు రూ.10 లక్షలు నష్టపోవడంతో అప్పుల్లో కూరుకుపోయాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఏటీఎం కేంద్రాలకు వచ్చే ప్రజలను లక్ష్యంగా చేసుకుని కార్డులు మార్చి నగదు కాజేసే నేరాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. మంగళవారం ఉదయం కుంట్లూరు రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎం సమీపంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 34 ఏటీఎం కార్డులు లభించాయి.

విచారణలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురం, భూత్‌పూర్, నల్గొండతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన పలు అప్రమత్తత మళ్లింపు (అటెన్షన్ డైవర్షన్) కేసుల్లో తన ప్రమేయాన్ని నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

## వణికిస్తున్న వానర సైన్యం...



❖ గుంపులు గుంపులుగా దాడులు చేస్తున్నా యి..
❖ గాయాలతో ఆసుపత్రులకు పరుగులు పెడుతున్న వైనం...
❖ ప్రాణాలకే ప్రమాదం ఉంది..
❖ నిద్ర వ్యవస్థలో అధికారులు..

**దశ బూర్గంపాడు:** గతంలో వానర సైన్యాన్ని చూస్తే చేతులెత్తి దండం పెడుతూ పండ్లు కొనుగోలు చేసుకుని పెడుతుంటాము. తమకి కనపడితే చాలు ఆంజనేయస్వామి కి సేవ చేసుకున్నంత భాగ్యం దక్కుతుందని ప్రజలు మొక్కుతుండేవారు. కానీ ప్రస్తుతం వానర సైన్యం ప్రజలపై భౌతిక దాడులకు దిగుతూ ప్రమాదాలకు నెట్టివేస్తున్నాయని ఆందోళన సంఘటనలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. బూర్గంపాడు మేజర్ గ్రామపంచాయతీలో గత వారం రోజులు నుండి కోతులు విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తూ ఏటీఎం, ప్రెస్ క్లబ్, చిన్న మసీదు, పోస్ట్ ఆఫీస్ ఏరియాలో సుమారు వందకు పైగా గుంపులుగా ప్రజలపై దాడులు చేస్తున్నాయని గ్రామపంచాయతీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విధి నిర్వహణలో ఉన్న బూర్గంపాడు పోస్ట్మాన్ నాగరాజు పై భయంకరంగా సుమారు 20 కోతులు అతనిపై దాడి చేస్తే గాయాలు పాలై ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఇది ఇలా ఉండగా మంగళవారం ఉదయం దుద్దుకూరి కృష్ణ అనే వ్యక్తిపై దాడి చేస్తే ఆసుపత్రిలో ట్రీట్మెంట్ పొందుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. కోతుల దాడికి భయపడి డ్యూటీ చేసే పరిస్థితిలో లేక పలు కార్యాలయాలకు వచ్చే మహిళలపై దాడులు చేస్తున్నాయని వాపోతున్నారు.



మండలంలో కొన్ని పంచాయతీలలో తీసుకున్న నిర్ణయాలు మేజర్ గ్రామపంచాయతీ భూర్గంపాడు లో కూడా తీసుకొని అమలు చేస్తే కోతుల దాడుల నుండి ప్రజలను విముక్తి చేసినట్లు అవుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా ప్రజల ప్రాణాల దృష్ట్యా బూర్గంపాడు పంచాయతీ పాలకవర్గం నిద్రమత్తు నుండి మేల్కొని కోతులను బయటకు పంపేయడానికి యుద్ధ ప్రాతిపదిక చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**వానర సైన్యం నుండి గ్రామ ప్రజలను కాపాడండి..**

మేజర్ గ్రామపంచాయతీ భూర్గంపాడు పంచాయతీలో ఉన్నటువంటి వానర సైన్యం రోజురోజుకు బీభత్సం సృష్టిస్తూ ప్రజలపై భౌతిక దాడులకు తెగబడుతూ గాయాలు పాలు చేయడమే కాకుండా ప్రాణాలు పోయే ప్రమాదాలకు దారితీస్తున్నాయని పంచాయతీ పాలకవర్గం తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ కూలీ సంఘం నాయకులు పున్నం డిమాండ్ చేశారు. ఒకపక్క పారిశుద్ధ్యం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా ఉంది ఎప్పుడు ఎలాంటి రోగాలు వస్తాయో అంటూ ప్రజలు భయపడుతు ఉన్నారని మరొకపక్క వానర సైన్యంతో ఏకంగా ప్రాణాలకే ప్రమాదాలు పొంచి ఉన్నాయని వీటితోపాటు వీధి కుక్కలు వీరంగం మరింత భయంకరంగా ఉందని పలు సోషల్ మీడియాలో పలు సంఘటనలు జరుగుతున్న అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని అధికారులు తీరుపై మండిపడ్డారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం వెంటనే గ్రామ ప్రజలను కాపాడేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు.

జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
బుధవారం 24-06-2026

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఖమ్మం వైరా | సత్తుపల్లి | పాడేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట

WWW.DASHANEWS.COM



## జిల్లా అటవీ అధికారిని మర్యాదపూర్వకంగా కలిసిన గొడిశాల రామనాథం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో :** జిల్లా అటవీ శాఖ అధికారి జి. కృష్ణ ఐఎఫ్ఎస్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు, పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశాల రామనాథం పోడు భూముల సమస్యపై కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. జిల్లా అటవీ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి. కృష్ణ కి శుభాకాంక్షలు తెలియజేసి, శాఖ అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని రామనాథం తెలిపారు .

## డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు




**దశ,భద్రాచలం:** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా భద్రాచలంలోని భగవాన్ దాస్ కాలనీలో ఉన్న భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుంజా ధర్మా మాట్లాడుతూ డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయవాద భావజాలానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. దేశ విభజన సమయంలో మొత్తం బెంగాల్‌ను పాకిస్తాన్‌లో విలీనం చేయాలన్న ప్రయత్నాలను అడ్డుకుని, పశ్చిమ బెంగాల్ భారతదేశంలో కొనసాగేందుకు కీలక పాత్ర పోషించారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం కేంద్ర మంత్రిగా పనిచేసిన ఆయన దేశ ప్రయోజనాల విషయంలో రాజీపడకుండా తన మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజాస్వామ్య విలువలను చాటిచెప్పారని పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని వ్యతిరేకిస్తూ "ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్ ఔర్ దో నిషాన్ నహీ చలేగా" అనే నినాదంతో ఉద్యమించిన ముఖర్జీ దేశ సమగ్రత కోసం జీవితాన్ని అంకితం చేశారని చెప్పారు. 1953 జూన్ 23న కాశ్మీర్‌లో నిర్బంధంలో ఉండగానే ఆయన అమరుడయ్యారని, దేశవ్యాప్తంగా ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ నివాళులర్పిస్తున్నామని కుంజా ధర్మా తెలిపారు. భారతదేశ ఏకత్వం, అఖండత కోసం ఆయన చూపిన మార్గం నేటికీ దేశభక్తులకు స్ఫూర్తిగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్‌తో పాటు పార్టీ నాయకులు ములిశెట్టి రాంమోహన్ రావు, ముత్యాల చంద్రశేఖర్, ఆవుల సుబ్బారావు, బోడ సత్యనారాయణ, దేవరపల్లి వెంకటేశ్వర్లు, షేర్ శ్రీను, జంపాల ప్రభాకర్, జి. వెంకటేశ్వర్లు (జీవా), కనసాని శ్రీనివాస్, జి. కేశవరావు, రంగులగుర్తి రామాచారి తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీలు నిర్వహించిన పోలీసులు



**దశ,పినపాక :** మండల పరిధిలోని ఏడుల్లా బయ్యారం బయ్యారం క్రాస్‌రోడ్ లో సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనల అమలును పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు అవగాహన కల్పిస్తూ, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. వాహనదారులు అవసరమైన పత్రాలు వెంట ఉంచుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు.

# సింగరేణి సమస్యల పరిష్కారానికి ఉద్యమం ఉధృతం

- *రెండో రోజుకు విజయవంతంగా రిలే దీక్షలు – ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై ఏఐటీయూసీ ఆగ్రహం*



**దశ,మణుగూరు:** మణుగూరు ఓసీ2 డీప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని, మణుగూరు ఓసీ గనుల అనుమతులను పొడిగించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు విజయవంతంగా కొనసాగాయి. దీక్షలను సింగరేణి అదనపు జనరల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి కార్మికుల సమస్యలు స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలకు పట్టడం లేదని ఆయన విమర్శించారు. ఒకప్పుడు వేలాది మంది కార్మికులతో కళకళలాడిన మణుగూరు ప్రాంత అభివృద్ధికి సింగరేణి ప్రధాన ఆధారంగా నిలిచిందని గుర్తుచేశారు. గనులపై ఆధారపడి వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, రవాణా రంగం, చిన్నతరహా వ్యాపారులు, గుమస్తాలు, లారీ యజమానులు, డ్రైవర్లు, కార్మికులు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఓసీ గనులకు 2027 వరకు మాత్రమే అనుమతులు ఉండటంతో కార్మికులు, స్థానిక ప్రజల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సింగరేణి పరిరక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసిరావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. గత రెండు రోజులుగా ఏఐటీయూసీ ఆందోళనలు కొనసాగిస్తున్నప్పటికీ ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం విచారకరమన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి మాట్లాడుతూ, సింగరేణి అభివృద్ధి కోసం గతంలో అనేక గ్రామాల ప్రజలు సహకరించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరించే ప్రయత్నాలను విరమించి వెంటనే సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. మణుగూరు ఓసీ అనుమతులను పొడిగించడంతో పాటు కొత్త బొగ్గు గనుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు. సింగరేణి అభివృద్ధి ఈ ప్రాంత ప్రజలు, వ్యాపారులు, కార్మికుల జీవనాధారంతో ముడిపడి ఉందని, అవసరమైతే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రెండో రోజు దీక్షలకు సీపీఎం, సీఐటీయూ, కాంగ్రెస్, ఏఐటీయూసీతో పాటు ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్, చాంబర్ ఆఫ్ కామర్స్, ఎల్ఐసీ ఏజెంట్లు, లయన్స్ క్లబ్, గుమస్తాల సంఘం, బార్ షాపుల అసోసియేషన్, ఆర్టీసీ ఉద్యోగులు, రిటైర్డ్ కార్మికులు, వ్యాపారవేత్తలు, విద్యాసంస్థల ప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై. రామ్ గోపాల్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, తోట రమేష్, గద్దం వెంకటేశ్వర్లు, కోడిమెల్ల సుజాత, బోశెట్టి సంపత్, ఆర్టీసీ మురళి తదితరులు పాల్గొన్నారు. దీక్షలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై. రామ్ గోపాల్‌తో పాటు మేకల ఈశ్వర్, ఎం.వి. రామనరసయ్య, ఆవుల నాగరాజు, శనిగరపు కుమారస్వామి, ఆదర సురేందర్, ఆడెపు రాజశేఖర్, బి. సురేందర్, ఆంగోటి రవి, ఇమాముద్దీన్, నారాయణ, వి. సతీష్, సాయి ప్రకాష్ చారి, పూర్ణచందర్, ఎస్‌కే సర్వర్, హుస్సేన్, నాగేశ్వరరావు, మల్లెల కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

- *గురుకుల పాఠశాల, కళాశాలలో మొక్కలు నాటి విద్యార్థులతో కలిసి భోజనం*




**దశ,పాల్వంచ:** పాల్వంచలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాలలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సమాజపరంగా తీవ్రమైన నష్టాలు కలుగుతాయని వివరించారు. ఎవరైనా మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎస్పీ వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాల గురించి ఆరా తీశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సతీష్ కుమార్, పాల్వంచ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొప్పుల సతీష్, పాల్వంచ రూరల్ ఎస్సై సురేష్ కుమార్, గురుకుల విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రామానుజవరం ఇసుక క్వారీపై చర్యలు తీసుకోవాలి

- *బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి*



**దశ, పినపాక:** మణుగూరు మండలం రామానుజవరం ఇసుకక్వారీ నిర్వాహకులపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ పినపాక మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రామానుజవరం ఇసుక క్వారీకి సంబంధించిన లారీలు మణుగూరుఏటూరునాగారం ప్రధాన రహదారిపై సాంబాయిగూడెం వద్ద సోమవారం వందల సంఖ్యలో నిలిచిపోయాయని, దీంతో సుమారు 2 గంటలు ట్రాఫిక్ జామ్ అయిందన్నారు. వందల సంఖ్యలో ఇసుక లారీలు ఒకవైపు ప్రతినిత్యం మణుగూరు వెళ్లే వాహనాలు కూడా వందల సంఖ్యలో ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పడ్డారన్నారు. ఇసుక లారీల ద్వారా అయిన ట్రాఫిక్ జామ్ మూలంగా పినపాక మండలం పోట్లపల్లి పంచాయితీ గడ్డిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి ప్రాణాలు పోయాయన్నారు. అతను ఆత్మహత్యయత్నం చేయగా అతని కుటుంబసభ్యులు వెంటనే మణుగూరు తరలిస్తుండగా మార్గం మధ్యలో సాంబాయిగూడెం వద్ద సుమారు 2 గంటలు ట్రాఫిక్ జామ్ కావడంతో ఆ వాహనాల మధ్యలో కుటుంబసభ్యులు చేతులతో మోసుకొని వెళ్లి 108 వాహనం ద్వారా మణుగూరు తరలించారని, అప్పటికే అతను మరణించారని వైద్యులు తెలిపారన్నారు. కేవలం ఇసుక లారీలు ప్రధాన రహదారిపై నిలిపి ఉంచడం మూలంగానే ప్రాణం పోయిందన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు గుమ్మడి గాంధీ, దాట్ల వాసుబాబు, పొనుగోటి భద్రయ్య, రవివర్మ, పోలిశెట్టి సత్తిబాబు, బత్తుల వెంకటరెడ్డి, చెన్నకేశవులు, షేక్ జాంగీర్, బూరరమేష్, పడిగె అశోక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీడీవో శ్రీకాంత్



దశ,మణుగూరు: మణుగూరు మండల ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం.శ్రీకాంత్ మంగళవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. మండల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా అమలవుతాయని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. మండల సమగ్రాభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. అనంతరం ఎంపీడీవో శ్రీకాంత్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే అందించిన సూచనలను అమలు చేస్తూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్ కుటుంబానికి అండగా అసోసియేషన్..

- *ఫోటోగ్రాఫర్ కుటుంబానికి భరోసా చెక్ పంపిణీ*



**దశ బూర్గంపాడు :** బూర్గంపాడు మండలానికి చెందిన భజన మల్లయ్య సీనియర్ ఫోటోగ్రాఫర్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా మంగళవారం మల్లయ్య కుటుంబ సభ్యులకు 1,60,000/ రూపాయల కుటుంబ భరోసా చెక్కును మల్లయ్య సతీమణికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫోటో &వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ పంపన రమేష్ఆయన బృందం చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ సభ్యత్వం ఉన్నవారికి అకాల మరణం పొందిన ఎడల ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందుతుందన్నారు. ప్రభుత్వం తమ ఫోటోగ్రాఫర్లను గుర్తించి ఆరోగ్య బీమా కార్డు, పిల్లల చదువులకు సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, జిల్లా అధ్యక్షులు కీసర సుధాకర్ రెడ్డి,ఉపాధ్యక్షులు పుట్టా మూర్తి, జిల్లా సంయుక్త కార్యదర్శి పూదోట విజయ్ ,ముండల అధ్యక్షుడు దాసరి బాలకృష్ణ, కార్యదర్శి రమణారెడ్డి, మండల ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# విద్యుత్ రంగ ప్రైవేటీకరణను ఐక్య ఉద్యమాలతో అడ్డుకోవాలి

- *బీటీపీఎస్‌లో విద్యుత్ ఉద్యోగుల జేఏసీల ఆందోళన*




**దశ,మణుగూరు:** విద్యుత్ రంగ ప్రైవేటీకరణను ఐక్య ఉద్యమాలతో అడ్డుకోవాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. వైటీపీఎస్‌లోని కోల్ ప్లాంట్, యాష్ ప్లాంట్లను ప్రైవేటీకరించే ప్రతిపాదనలను నిరసిస్తూ మంగళవారం జేఏసీల సంయుక్త ఆధ్వర్యంలో బీటీపీఎస్‌లో ధర్నా, భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కర్మాగారంలోని అడ్మినిస్ట్రేషన్ భవనం వద్ద ప్రారంభమైన ర్యాలీ ప్రధాన గేటు వరకు కొనసాగింది. సుమారు గంటపాటు సాగిన ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రైవేటీకరణ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం.ఏ. వజీర్ మాట్లాడుతూ, విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులు ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడం బాధాకరమన్నారు. వైటీపీఎస్‌లోని కోల్ ప్లాంట్, యాష్‌ప్లాంట్లను ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించే టెండర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జెన్‌కో పరిధిలోని ఇతర విద్యుత్ కేంద్రాల్లో కూడా పాక్షిక ప్రైవేటీకరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. జేఏసీ బీటీపీఎస్ కన్వీనర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, జేఏసీ బీటీపీఎస్ కన్వీనర్ చందు మాట్లాడుతూ, వైటీపీఎస్‌లో జరుగుతున్న ప్రైవేటీకరణ చర్యలకు వ్యతిరేకంగా కేంద్ర జేఏసీ కమిటీ ఆదేశాల మేరకు ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రానున్న రోజుల్లో కేంద్ర జేఏసీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉద్యమాలకు అన్ని ఉద్యోగ సంఘాలు మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ బి. రవి ప్రసాద్, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు మహేష్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు రమేష్, కార్మిక సంఘం1535 రీజినల్ అధ్యక్షులు వి. ప్రసాద్, కార్మిక సంఘం1104 అధ్యక్షులు బి. సత్యనారాయణ, కార్మిక సంఘం327 ప్రధాన కార్యదర్శి పి. సాంబ, ఏఐటీయూసీ నాయకులు టి. శోభన్, క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ సిద్దుల హుస్సేన్, బీసీ అసోసియేషన్ నాయకులు కృష్ణకాంత్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు వి. అనిల్ తదితరులు పాల్గొన్నారు.